పారువేట

కేతు విశ్వనాథరెడ్డి

కోటయ్యకు కొడుకు వాలకమేమీ అర్థం కాలేదు. యూనిఫారం విప్పకుండా మౌనంగా పడకేసిన కొడుకును భోజనానికి వెళ్లేముందు పిలిచి చూచేడు. ఈశ్వరయ్య "నువ్వుతిను" అని మాత్రం అన్నాడు.

పుట్టింటికి కాన్పుకోసం పోయిన పెళ్ళాం కోసం ఆత్ర పడుతున్నాడేమో! వుండదు, పై ఆఫీసర్ల తిట్లుతిని వేడిలో వున్నట్లుంది. అయినా తిట్లు ఆరోగ్యానికి మంచివేలే. యెదురు దెబ్బలు తింటేనే గట్టిపడేది. అనుకుంటూ కోటయ్య తాను తీరికగా భోంచేసి వచ్చేడు. యింకా మంచంలోంచీ లేవని కొడుకును చూచి 'యేదైనా గొడవలో యిరుక్కోలేదు కదా' అనే అనుమానం కలిగింది. కొడుకును కదిపేడు.

"యేం అట్లా వున్నావు?"

"యీ వుద్యోగం నేను చెయ్యలేను. మనిషన్న వాడెవ్వడూ చెయ్యలేడు.''

ఈశ్వరయ్య కంఠంలో ధ్వనించిన దృఢ

నిశ్చయానికి కోటయ్య అదిరిపడ్డాడు.

వీడెంత సులభంగా వుద్యోగం చెయ్య లేనంటున్నాడు? తన ముప్పయి అయిదేళ్ళ సర్వీసులో మాటవరుసకయినా తాను అనుకోని మాటను యెంత కష్టం లేకుండా అంటున్నాడు? గార్డుగా రిటయిరయినాననీ, పదిమంది పిల్లల సంసారమనీ, యే ఆధారంలేదనీ, పై ఆఫీసర్ల కడుపులూ కాళ్ళూ పట్టుకొని, నానా గడ్డీ గరిచి టెంపరరీగా వేయించుకొన్న ఫారెస్టు రుద్యోగాన్ని యెంత సునాయాసంగా తీసి పారవేస్తున్నాడు. ముండమోపి బి.ఎస్.సి. డిగ్రీ తీసుకొని నాలుగేళ్ళు ఖాళీగా మూలని కూర్చున్నది మరిచిపోయినాడేమో! మనిషన్న వాడెవడూ యీ వుద్యోగం చెయ్యలేడట! చేసే వాళ్ళంతా అడివి జంతువు లయినట్లు! యే దేవుడో దిగివచ్చి కల్పవృక్షాన్నో కామధేనువునో కోరుకోమంటే రిటయిరుమెంటు అనేది లేకుండా యెర్ర చందనం, మందలు మందలు మేకలూ వుండే రేంజిలో వాచరు వుద్యోగమయినా కోరుకునే తన కడుపున యెట్లా పుట్టినాడు వీడు? చిన్నప్పటినుంచీ యింతే! తలతిక్క వెధవ! వీని తలకాయ రిపేరు చెయ్యాలి. లేకపోతే వీడెక్కడ తేలుతాడో వీడికే తెలియదు.

కోటయ్య నిశ్చయానికివచ్చి కొడుకును అడిగేడు:

"ఏం? ఏ రేంజరు సారో, డి. యఫ్. వో. దొరో తిట్టినారా? ఈకాలం ఆఫీసర్లు వొక ఆఫీసర్లూ, వీళ్ళతిట్లు ఒక తిట్లూనా? తెల్లోడి రాజ్యంలోని ఆఫీసర్లయితే వాళ్ల జాతిపుట్టు ఆఫీసర్లు. తిట్టినా సొగుసే. తన్నినా సొగుసే. బ్రిటీషోళ్ళ హయాంలో వాచరుద్యోగంలో వున్నప్పుడు-నువ్వు పుట్టలేదు—వొకమారు యేం జరిగిందో తెలుసా?''

'ఇక సోది మొదలయింది' అనుకుంటూ ఈశ్వరయ్య అటుతిరిగి పడుకున్నాడు. కోటయ్య పూనకం వచ్చినవాడిలా చెప్పుకపోయేడు:

"డి. యఫ్. వొ. దొర మన నల్లదొరే. అయితే నేం! తెల్లదొరల నోట్లోంచి వూడిపడినోడు. కేంపుకొచ్చినాడు. ఆ దొరకేమో తెల్లవారి ఐదింటికే బెడ్డుకాఫీ అలవాటు. అర్ధరాత్రి కటిక చీకట్లో దగ్గరున్న పల్లెకు నడిచిపోయి సేరుపాలు తెచ్చినాను! కాగబెడుతూంటే పొరపాటున వులికి పోయినాయి. పై ప్రాణాలు పైన్నే పోయినాయి. కాసిన్ని పాలు మిగిల్తే వాటితొ కాఫీ చేసుకొని తీసుకపోయినా. 'ఇంత నల్లగుందేం కాఫీ' అని చిందులు దొక్కినాడు. కావలసిన పాలు దొరకలేదని అబద్దమాడినా 'పాల్లేకపోతే నీ పెళ్లాం చళ్ళు పిండి కాఫీ కలపాల్రా లంజకొడుకా—అని... "

"వాన్ని అక్కడే అడవిలోనే పాతిపెట్టకపోయినావా, అప్పుడే."

ఈశ్వరయ్య అటు తిరిగి పడుకున్న వాడల్లా లేచి కూచుని వుద్రేకంతో అన్నాడు.

కోటయ్య పకపకా నవ్వి ప్రశ్నించేడు:

"అడవిలోకి వచ్చే కట్టెల మోపులోళ్ళనో, మేకలోళ్ళనో మనం అటులనే తిడతా మనుకో. వాళ్ళు మనల్ని పాతి పెడుతున్నారా? పెద్ద జీవాలు పెద్ద జీవాలే. సన్నజీవాలు సన్నజీవాలే"

ఈశ్వరయ్య దిగ్గున మంచం మీంచి లేచి కూచొని వుద్రేకంతో చెప్పుకపోయేడు:

"అందుకే నేననేది. సన్నజీవాలను హింసించే యీ పనికిమాలిన వుద్యోగం వద్దని. యీ దినం రేంజాఫీసరు రెయిడుకు పోవాలన్నాడా? పోయినాం. యెందుకో తెలుసా? నెలకొక్కసారి యేదో వొకకేసు బుక్ చెయ్యకపోతే మా మొగుళ్ళు వూరుకోరట! రెవెన్యూ చూపాలట! పైన ఫ్లయింగ్ స్క్వాడ్ భయం. నమ్మకముండి కాదు; అడవిని రక్షించడానికి కాదు.... యీవాళ రెయిడ్‌లో దొరక్కదొరక్క యీ దినమో రేపో చావడానికున్న ముసల్ది దొరికింది—కట్టెల మోపుతో. పది వంద్రెండేండ్లు కూడా లేని యిద్దరు పిల్లకాయలు దొరికినారు—అరమూటె బొగ్గుల్తో. మరో ముసలోడు పది బడుగు మేకల్తో దొరికినాడు.

ఆ దృశ్యాన్ని తలచుకుంటేనే కడుపు మండుతుంది. మా వాళ్ళు తరిమితే కట్టెల మోపుమీద పడి ముసల్ది కూలబడింది. పిల్ల

కాయలేమో కంపల్లో పడినారు. వాళ్ళ దగ్గర గతికినా కూడా మావాళ్ళు వాళ్ళను బండ తిట్లు తిట్టడం, తన్నడం! 'మొన్ననే వొక కోడి పెట్టను తెచ్చి స్తినే మీ దూము తగలా అంత లోనే యింత అన్నేయమా' అని రేంజరుతో ఆ ముసల్ది మొత్తుకుంది. 'మేకపిల్లను తోలి పెట్టినానే మేం తిని బతికేదెట్లా' అని ఆ ముసలోడు యేడ్చినాడు. యీ ఘోరానికి తోడు మోపుకు పదీ, మేకకు అయిదూ కాంప వుంటు. అరమూటె బొగ్గులకు ముప్పయి రూపాయలు కాంపవుండు. యెక్కణ్ణుంచి తెచ్చి కడతారు? మళ్ళీ అడవి కొస్తారు, కట్టెలకూ, బొగ్గులకూ, మేకల మేతకూ. మళ్ళీ తన్నులు, కాంపవుండ్! యీ ఘోరాలు నేను చెయ్యలేను. యీ అడవి డ్యూటీ నాకువద్దు. యీ రకం అడవి రక్షణ నాకు చేతకాదు. కటిక దర్రిదుల్ని పీక్కుతినే యీ వుద్యోగం నాకు వద్దు. చేత నయితే అడవిమీద లక్షలు సంపాదించే వాళ్ళను పట్టుకోవాలి."

ఈశ్వరయ్య తన బాధనూ, అక్కసునూ వెళ్ళగక్కేడు. గుండె తేలికయింది. మళ్ళీ మౌనంగా పడుకున్నాడు.

కొడుకు మాటలు విని కోటయ్యకు మతి పోయింది.ఆ మధ్య ఎప్పుడో చూచిన కురుక్షేత్ర నాటకం మనసులో మెదిలింది. జీవితంలో తాను గడించిన అనుభవ సారాన్ని బోధించేడు:

"వొరే నాయనా! నువ్వుండేది అడవి. నువ్వు చేసేది అడివుద్యోగం. నువ్వేమీ అదేంది జీవ కారుణ్య సంఘమోడివి కావు. యెవడి బతుకు వాడిది. నువ్వు ఆర్చే వాడివీ కాదు తీర్చేవాడివీ కాదు. వుద్యోగంలో చేరి పదిరోజులన్నా కాలేదు. నీ వాలక మేదో విచిత్రంగా వుంది. వాడెవడో బుద్ధుని మాదిరి మాటలాడుతున్నావు. నేను కొన్ని అడుగుతాను చెప్పు. యెవడో జాలిపడితేనే నీకు వుద్యోగం దొరికిందా? లేదే. మరి నాకు రెండుమూడు వేల ఖర్చెల్లా అయింది? రేపు యే ఆఫీసర్లోవచ్చి తలకోన గెస్టవుసులో దిగి డిన్నర్లంటే, జాలిపడి నీ రేంజరు నిన్నొదులుతాడా? వదలడే. దమ్మిడీ లంచం ముట్టకోకపోయినా 'గతికి వుంటావులే నా కొడకా నీ భాగం యే యిన్నూరో తీసకరా' అనడా ఆ మీసాల రేంజిరోడు. మామూళ్ళు వసూలు కావా? నీ పెండ్లాం రేపు పుట్టింటి నుంచీ కొడుకునో కూతుర్నో యెత్తుకొని వస్తే వాళ్ళను జాలిపడి లోకం సాకుతుందా? సాకదే. అడవి మీద బతికే వాళ్ళు వాళ్ళ తిప్పలేవో పడతారు. వాళ్ళమీద బతికేది మన వుద్యోగం. యిటుల జాలీగిలీ మాటలువద్దు. అడివిలో బతుకిది. మబ్బు మీదేసుకొని కూచోవద్దు. నువ్వేదో అడవిమీద లక్షలు సంపాయించే వాళ్ళను పట్టాలంటాన్నావు. అదేం కాలేజీల్లో స్ట్రయికు అనుకున్నావా? శాంతమ్మ మాదిరివాళ్ళు అడవి మీద లక్షలు సంపాయిస్తున్నారు నిజమే. వాళ్ళనేం జేస్తావు—వాళ్ళకు మచ్చిక కావడం తప్ప. చిల్లరోళ్ళ సంగతంటావా? వాళ్ళంతే. రిజర్వు ఫారెస్టులో మేక అరుపు వింటే నిద్దర్లో వున్నా మేకకు పావలా మామూలు కోసం చెయ్యి చాస్తున్నాడే—మీ డి. యఫ్. వో. ఆ దొరకులేని జాలి నీకెందుకు? న్యాయమో అన్యాయమో నువ్వెవడు చెప్పడానికి. అడివి రూల్సు అట్లున్నాయి...."

కొడుకేమీ జవాబు చెప్పలేదే అని "యేమంటావు?" అని కోటయ్య ఈశ్వరయ్యను హెచ్చరించేడు. ఈశ్వరయ్య నిద్రపోయాడని తెలుసుకున్నాడు. 'అదేందీ వుద్యోగ వైరాగ్యం అయి వుంటుందిలే' అని కోటయ్య నవ్వుకొని పడకేశేడు. కొడుకు తిండి తినకుండా పడుకున్నందుకు కోటయ్య మనసు కలత పడింది.

నిద్రపోతున్న ఈశ్వరయ్య మనసులో యేవేవో చిత్రాలు, చెవుల్లో వింత వింత శబ్ద తరంగాలు. ఈశ్వరయ్య మెదడును యెవరో కుదిపి నట్లయింది. ముళ్ళ చెయ్యితో గుండెను కెలికినట్లయింది. మనసును తొలిచినట్లయింది.

ఈశ్వరయ్య కలసాగిపోతోంది.

యెవరూ? యెవరది??

రిజర్వు ఫారెస్టులో కాకి దుస్తులు. కాకి దుస్తుల్లో కట్టెలమోపు ముసల్ది; చింపిరి జుట్టు

పిల్లలు; మేకల ముసిలోడు. కట్టెల మోపులు మోస్తూ, బొగ్గుల మూటెలు యెత్తుకొనివస్తూ, మేకలు కాస్తూ డి.యఫ్.వో, రేంజరు, గార్డులు. కాకీ దుస్తుల్లోకి వాళ్లు మురికి చిరుగు బట్టల డి. యఫ్. వోనూ, రేంజరునూ, గార్డులనూ, వాచర్లనూ తిడుతూ, తరుముతూ తంతున్నారు.

ఆశ్చర్యంగావుంది. తిరగబడరే. వీళ్ళకేం పొయ్యేకాలం!

తాను దూరంగా నిలబడి చూస్తున్నాడు.

అరే! అదేం!

ఫ్లయింగ్ స్క్వాడ్! రెట్ సాండర్స్ ఫ్లయింగ్ స్క్వాడ్!!

దిక్కుతోచని వురుకులు! దిక్కు తెలీని గెంతులు!!

అడవి కంపల్లో, ముళ్ళ పొదల్లో, రాళ్ళ సముద్రంలో,

వురుకులూ, పరుగులూ, గెంతులూ.

ముసలి డి.యఫ్.వో. కట్టెల మోపు మీద వేసుకున్నాడు.

మీసాల రేంజరు కంపల్లో పడ్డాడు.

తను నవ్వుతున్నాడు. నవ్వుతూ నవ్వుతూ తను మేకగా మారిపోయేడు.

మే .. మే .మే....

తనను తండ్రి తోలుకొని పోతున్నాడు.

'పో ముండా అడవిలో మెయ్యి' అంటున్నాడు.

యెవరిది; యెక్కడా చూచినట్లు గుర్తులేదు. ముసల్దే అందమైన స్త్రీగా మారిపోయింది. ఆమె చుట్టు డి. యఫ్. వోలు, రేంజర్లు.

మేక దొరికిపోయింది. తను దొరికిపోయేడు.

'మేకపోతు మాంసం బాగుంటుంది' అంది ఆవిడ. ..శాంతమ్మ!

కాకీ దుస్తులవాళ్ళు తన గొంతుకోస్తున్నారు.

మే.... మే.... మే....

తన గర్భిణీ భార్య యేడుస్తోంది.

రక్తం.......రక్తం.... ..అడవి అంతటా రక్తం ...బొగ్గుల కోసం కాల్చే అడవి మంటల రక్తం....తన గొంతు విడివడి....

ఈశ్వరయ్యకు భయంతో మెలకువవచ్చింది. గుండెలు గుబగుబలాడేయి. పీడకల! ఆరాత్రి అంతా ఈశ్వరయ్యకు నిద్రలేదు.

తెల్లవారిందో లేదో, వాచరువచ్చి "డి. యఫ్. వో దొరగారు గెస్టుహావుసుకు అర్జంటుగా రమ్మంటున్నార"ని చెప్పేడు. కళ్ళు మంటలతో, విసుగుతో, అసహనంతో యూనిఫాం మార్చుకొని ఈశ్వరయ్య ఫారెస్టు బంగళా చేరుకున్నాడు.

డి. యఫ్. వో యెగాదిగా చూస్తూ తాపీగా తెల్పేడు:

"మీ రేంజాఫీసరు వారం రోజులు సెలవు పెట్టేడు. యే క్షణాన్నయినా ఫ్లయింగ్‌స్క్వాడ్ రావచ్చు. కాస్త వాళ్లు జాగ్రత్త పెట్టుకొని వుండు, సెక్షన్లో. తలతిరుగుడు పనులు చేశేవో యింటికి పోతావు."

తనేం తలతిరుగుడు పనులు చేస్తాడని అనుకుంటున్నాడో ఈశ్వరయ్య డి.యఫ్.వోనే అడగాలనుకున్నాడు. నోరెండిపోయి నోట మాటరాలేదు.

అంతలోనే డి. యఫ్. వో అన్నాడు:

"గార్డు పోలయ్య చెబుతాడు మిగతా. యూ కెన్ గో...." చెమట తుడుచుకుంటూ ఈశ్వరయ్య బయటపడ్డాడు.

కోపాన్ని దిగమింగుకుంటూ గార్డు పోలయ్యను ఈశ్వరయ్య అడిగేడు;

"యేమిటి పోలయ్యా; యేమిటంట?"

"దొరగారి మాటలా! నువ్వెట్లా వుద్యోగం చేస్తావు సార్? నిన్ననేమో ఆ కట్టెలోళ్ళనుచూచి పాపం పావం అంటివి. మీ నాయన కడుపున పొరపాటున పుట్టినావు. గార్డు అయితేనేం మీ నాయన పిల్లరాజు యేలినట్లు రాజ్యం యేలినాడు. యీ అడవిని — వుద్యోగం చేసినన్నాళ్ళూ. నువ్వేమో...."

పోలయ్య నవ్వటం మొదలు పెట్టేడు.

ఫారెస్టరు ముందు గార్డు నవ్వటం ఈశ్వరయ్యకు నచ్చలేదు. కేడరు గుర్తు కొచ్చింది. పోలయ్య వయసు గుర్తుకొచ్చి తమాయించుకున్నాడు.

"అసలు విషయం చెప్పు" అన్నాడు.

"ఏంలేదు సార్! రెడ్ సాండర్స్ ఫ్లయింగ్ స్క్వాడు డి. యఫ్. వో. కు మన రేంజిమీదే కన్ను. వున్నట్టుండి మీద పడుతాడు, ఏ అర్థరాత్రో. యమ స్ట్రిక్టు. యెర్రచందనం వుండేదీ మన రేంజిలోనే. బయటికి పోయేదీ మనరేంజి నుంచే. మరీ మన సెక్షన్‌నుంచే. యే వెధవ నా కొడుకో ఫలానా టయింలో ఫలానాలారీలు పోతాయని, ఫలానాచోట పట్టుకోవచ్చునని ఇన్ఫరుమేషను యిస్తాడు. దానికితోడు మన గార్డు నాకొడుకులూ, వాచరు గాడిదకొడుకులు యిన్ఫార్మెంట్లుగా వుంటారు. లారీలు దొరుకుతాయి. నమ్మకద్రోహం చేసినామని శాంతమ్మ మనుషులు మనపని పడతారు. షరీకైనామని, సరిగా డ్యూటీ చేయడంలేదని ఫ్లయింగు స్క్వాడోళ్ళు పైకిరాసే రిమార్కులు. ఇదొక గూటం! మన దొరగారు రిటైర్మెంటుకు దగ్గరో వున్నారా? ఈ గొడవంతా యెందుకని ఫ్లయింగ్ స్క్వాడు వచ్చేది ముందుగానే కనుక్కొని శాంతమ్మ మనుషులకు తెలపమంటారు."

"ఆమాట నీతో చెప్పినారా?"

"పై ఆఫీసర్లు నోటితో చెప్తారా సార్. మనం కనుక్కోవాల. తంటాలు పడాల— వొకరి సొమ్ము ఆశించినాక..."

"యెవరి సొమ్ము?"

"తెలీనట్లు మాటాడ్తావేం సార్? మీ నాయన చెప్పలేదా? అడుగు....నువ్వింకా కొత్త కదా?''

ఈశ్వరయ్యకు ఆ మర్మమేదో మనసుకు తట్టింది. అడవి పరిపాలన, అడవి న్యాయం, అడవిపంపకాలమీదఆధారపడ్డాయనుకొన్నాడు. ఈశ్వరయ్య నీరసంగా అడిగేడు:

"అయితే ఇప్పుడేం చేయాలంటావు?"

''చేసేదేముంది సార్? ఆ రేంజరు సారు వూర్లోలేడు. యీ శాంతమ్మ మహాతల్లేమో ఎర్రచందనం రెండు లారీలోడ్లు రేపు రాత్రికే మద్రాసు తోలి తీరాలని మొండికేసింది. జపాను స్టీమరు మర్నాడే పోతుందట! ఈ ఫ్లయింగు స్క్వాడు డి. యఫ్. వో వచ్చినాడంటే తాను తినడు వొకర్ని తిననీడు. వొక అర గంట ఆ దొరతో మాటాడినామా మనంకూడా ఇన్ఫార్మెంట్లుగా మారిపోతాము — నువ్వింకా

చూళ్లేదుకానీ."

ఈశ్వరయ్యకు ఫ్లయింగ్‌స్క్వాడ్ డి.యఫ్‌వోను చూడాలనిపించింది.

పోలయ్య దిగులు ముఖంతో అన్నాడు.

"చూడుసార్! నా పెండ్లాం తిరువతి ఆస్పత్రిలో వుంది. సీరియస్‌గా వుందని మనిషి వచ్చినాడు. మన దొరగారికికూడా చెప్పినా. సెలవుపెట్టి పోతా. నువ్వేమో మీ నాయనకు యీ విషయం చెప్పు చాలు. రిటయిరయితేనేం యిలాంటి వాటిల్లో డిపార్టుమెంటుకు యెంత తోడో! నేనుంటే బాగుండేది కానీ నాభార్య.."

"పాపం! నువ్వెళ్ళు. ఆమె కెట్లుందో? ఏదో తంటాలు పడవచ్చులే, మిగతా మన వాళ్ళతో."

ఈశ్వరయ్య సానుభూతి పోలయ్యని క్షణం పాటు కదిలించింది.

తను అబద్ధమాడినా నమ్మినాడు. ఎక్కడో స్కూలు టీచరుగా స్థిమితంగా వుండవలసినోడు ఇంకా సంపాయించాలని ముదనష్టపు కోటయ్యా అడవిలో పడేసినాడు. యేం నెత్తికి తెచ్చుకుంటాడో?

పోలయ్యా జాలిపడి తప్పుకున్నాడు.

ఈశ్వరయ్య మనసు తీవ్రంగా మథనపడసాగింది. అతనిలో భయం, వెర్రివుత్సాహం; పెద్దజీవాలకు మచ్చిక కాకూడదు. పడితే వాటి పనే పట్టాలనే సాహసం తలయెత్తింది. కట్టెల ముసిలిదానిలాంటి యే కుందేలునో, వెంటాడడం కాదు, చేతనయితే శాంతమ్మలాంటి పులుల్ని వేటాడాలి. తరిమి తరిమి నీళ్లు తాగించి చంపి చంపి....

బి.యస్సీ. చదువుకునే రోజుల్లో సమ్మె నాయకత్వం వహించి, ఒక పెద్దహోటలు వాడి మెడలువంచి ధరలు తగ్గించిన రోజులు ఈశ్వరయ్యకు గుర్తుకొచ్చేయి. ఒక నిశ్చయానికి వచ్చేడు.

యింటికివెళ్ళి తండ్రికి పోలయ్యచెప్పిన విషయాలు చెప్పేడు ఈశ్వరయ్య. కోటయ్య ఈశ్వరయ్య వేపు మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు:

"ఇప్పుడు నువ్వు పనిచేస్తున్న యీ నెరబయలు సెక్షన్లో పదేండ్లు పనిచేసినా—ఆఫీసర్లకూ, కంట్రాక్టర్లకూ, అడివిమీద బతికే

ప్రతిజీవికీ గొడ్డకాకుండా. వాళ్ళు బతికినారు, మనల్ని బతకనిచ్చినారు. రేపు ఫ్లయింగ్ స్క్వాడ్ వస్తుంది. ఆ వూత్తుకోట రూటు తప్పించు....”

ఈశ్వరయ్య తలాడించేడు.

మరుసటిరోజు రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ జీపు రానేవచ్చింది. ఈశ్వరయ్యనుకూడా వెంట తీసుకొని అడివిలోని రూట్లగాలింపు జరిగింది. తెల్లవారుజామున నాలుగుగంటల ప్రాంతంలో వూత్తుకోట దగ్గర మాటువేస్తే అనుకున్న రెండునంబర్లుగల లారీలు కనిపించాయి. కనిపించినట్లే కనిపించి రాష్ట్రి సరిహద్దుదాటి మద్రాసు రాష్ట్రింలోకివెళ్ళి మాయమయ్యేయి.

లారీలు దొరక్కపోయినా ఈశ్వరయ్య ఫ్లయింగ్ స్క్వాడుకు బదిలీ అయ్యేడు. అంతలోనే ఫ్లయింగ్‌స్క్వాడ్ డి.యఫ్.వో రాజారావు కర్నూలు వర్కింగ్ ప్లాన్‌కు మారిపోయాడు. రాజారావు బదిలీతో ఈశ్వరయ్య నడుము విరిగినట్లయింది. తిరిగి రెగులర్ సెక్షన్‌కు బదిలీ జరిగింది.

రెగులర్ సెక్షన్లో ఫారెస్టురుగా చార్జితీసుకున్న రోజు కోటయ్య అతి శాంతంగా కొడుకుకు చెప్పేడు:

"నీ దేశసేవలు అందరికీ తెలిసినాయి. ఆ దినం లారీలు దొరికివుంటే తెలిసివుండేది. యెవడో తలతిక్క నాకొడుకు ఆఫీసరుస్ట్రిక్టుగా వుంటాడు. దేశమంతా వాళ్ళతోనే నిండిందనుకోకు. వాడితోన్నే యేదో జరుగుతుందనుకునేవు? నీ ఫ్లయింగ్‌స్క్వాడు డి యఫ్.వో మెప్పులు నిన్ను రక్షింపవు. రెగులరోళ్లు నీమీద కావలసిన పిటీషన్లు పెట్టించినారు—డబ్బుగుంజితింటున్నావని. పిటిషన్లు పెట్టింది నువ్వు జలిపడిన మేకలోల్లు. మర్యాదగా బతకడం నేర్చుకో—నీ పెండ్లాం పిల్లలవేపుచూడు. నువ్వూ, నేనూ మనకంటే తగ్గోళ్ళని యేడిపించి బతకాల్సినవాళ్ళమే తప్ప మనకంటే పైవాళ్ళ నేదో పొడుస్తా మనుకోవడం మన నాశనానికే.''

ఈశ్వరయ్య అయోమయంలో పడ్డాడు. కొత్తగా ఫ్లయింగ్ స్క్వాడుకు వచ్చిన డి.యఫ్.వో తన ట్రాన్స్ఫరుకు యెందుకువప్పుకున్నట్లో ఈశ్వరయ్యకు అరంకాలేదు. తన మీద మేకలోళ్ళు పెట్టినారని ముసలోడంటున్నది అబద్ధం. సర్వాబద్ధం. వాళ్ళెప్పుడూ అది చేయరు, చేయలేరు అనుకున్నాడు.

ఆ సాయంత్రం సెక్షన్లో మేకలమంద వుందనీ, డి.యఫ్.వో దొర వెళ్తున్నారని పోలయ్య పరిగెత్తుకుంటూవచ్చి ఈశ్వరయ్యతో చెప్పేడు. ఈశ్వరయ్య పరుగుతీశాడు.

తన సెక్షన్లో, తలకోన బీటులో.

కాకీదుస్తుల హడావిడి. కట్టెలమోపులు యెక్కడివక్కడ పడవేసి తన్నులు, కొంప వుండ భయంతో పరిగెత్తిపోతున్న పిల్లాపీచూ, ముసలీ ముతకా. తోకలు తెగినట్లు అరుస్తూ అడవి అంతటా చెల్లాచెదరయి గొంతుల్లో, పరుగుల్లో మేకలు.. మేకపిల్లలు.

డి.యఫ్.వో కరిచేడు:

"డ్యూటీలో లేకుండా యెక్కడ చచ్చేవు బ్లాగర్డ్. ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు యిన్ఫర్మేషన్ యివ్వను చచ్చేవా? బొక్కలో పెడతాను. యిప్పుడొచ్చిన పిటీషన్లు చాలు. పరుగెత్తు. పట్టుకో వాళ్ళను. యూ రాస్కెల్. మేకల్ని మళ్ళించు. వూ. అలా చూస్తావేం. కళ్ళు తిరుగుతున్నాయా? గో...రన్..”

ఎవర్ని తిడుతున్నాడో తెలీని బండబూతుల్తో ఈశ్వరయ్య అడ్డంగా అడవిలో మేకలవెంట.. మేకల్లో కలిసి . .